మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి

# హజ్ విధానం

మూలం: షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహ్మ.అలై)　　తెలుగు అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ప్రశంసలు, పొగడ్తలన్నీ ఒక్కడైన అల్లాహ్‌కే శోభిస్తాయి. మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై, ఆయన అనుయాయులపై శాంతి శుభాలు వర్షించుగాక!

## హజ్ సంకల్పం చేసుకున్న సోదరులారా!

అల్లాహ్ మనందరిపట్ల ప్రసన్నుడవ్వాలనీ, అన్ని రకాల ఉపద్రవాలకు అపమార్గాలకు దూరంగా ఉండే సద్బుద్ధి నొసగాలని ప్రార్థిస్తున్నాను. తనకు నచ్చిన, తాను మెచ్చిన పద్ధతిలో హజ్ చేసే సద్బుద్ధిని ఆయన మనకు ప్రసాదించాలని, మీరు చేసిన హజ్ స్వీకార యోగ్యం కావాలనీ, మీరు మీ దేశాలకు సురక్షితంగా తిరిగి వెళ్ళాలని కూడా ప్రభువైన అల్లాహ్ సన్నిధిలో వేడుకుంటున్నాను. ఉత్తమ ప్రదాత అల్లాహ్ మాత్రమే.

## ముస్లిం సోదరులారా!

సర్వకాల సర్వావస్థల్లో అల్లాహ్‌కు భయపడుతూ, ఇస్లాం ధర్మంపై స్థిరంగా, అల్లాహ్‌కు అయిష్టమైన వాటిపట్ల ఎంతో అప్రమత్తంగా ఉండవలసిందిగా మీ అందరినీ అభ్యర్థిస్తున్నాను. నిశ్చయంగా సకల ఆరాధనలలో అల్లాహ్‌ను ఏకేశ్వరునిగా నమ్ముతూ, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకుని, ఆరాధనలను దైవప్రవక్త ముహమ్మద్(సఅ) విధానానికనుగుణంగా నెరవేర్చటం మహత్పూర్వకమైన విషయం. హజ్ చేసినా, మరేయితర ఆరాధనలు చేసినా దేవుడు తన ప్రవక్త(స)కు ఆజ్ఞాపించిన రీతిలోనే చేయాలి. అల్లాహ్‌కు సహవర్తులుగా వేరొకరిని నిలబెట్టడం అన్నిటికన్నా పెద్ద దుర్మార్గం, మహాపరాధం. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను కోరిన వారి కొరకు క్షమిస్తాడు" (సూరె నిసా : 48). అంతేగాక అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (సఅ) నుద్దేశ్యించి ఇలా సెలవిచ్చాడు: **" ఓ ప్రవక్తా! నీ వద్దకూ, నీకు పూర్వం గతించిన ప్రవక్తల వద్దకూ ఇలా వహీ పంపబడింది: 'ఒకవేళ మీరు షిర్కు(బహుదైవారాధన) చేస్తే, మీ కర్మలన్నీ వ్యర్థమైపోతాయి; మీరు నష్టానికి గురి అవుతారు."** (అజ్జుమర్ - 65)


హజ్ యాత్రీకులారా! మన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనాకు ప్రస్థానం చేసిన తరువాత ఒక్కగానొక్కసారి మాత్రమే హజ్ చేశారు. అదే అంతిమ హజ్‌గా ప్రసిద్ధి చెందింది. తన జీవితపు ఆఖరి దశలో ఆయన(స) ఈ హజ్ యాత్ర చేయగా, ఆయన ప్రియ సహచరులు (పెద్ద సంఖ్యలో) ఆయన వెంట వచ్చారు. హజ్ క్రియలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. హజ్ సందర్భంగానే ప్రవక్త (స) వారు తన సహచరులనుద్దేశించి ఇలా ఉద్బోధించారు: **"ప్రజలారా! హజ్ చేసే పద్ధతిని నా నుండి నేర్చుకోండి."** అందుకే ముస్లింలు ఎప్పుడు హజ్ చేసినా, తమ ప్రవక్త(స) పద్ధతిననుసరించి చేయటం తప్పనిసరి. ఎందుకంటే ఆయనే మనందరికీ అతి పెద్ద సంస్కర్త. ఆయన లోకవాసులందరి కోసం కారుణ్యంగా ప్రభవింపజేయబడ్డారు. తన దాసులందరికీ దైవప్రవక్త(స) విధానం ఉదాహరణ ప్రాయమని అల్లాహ్ సెలవిచ్చాడు. ఆయనకు విధేయత కనబరచి, ఆయన అడుగుజాడలలో నడచుకుంటేనే స్వర్గం లభిస్తుందని కూడా దేవుడు ప్రకటించాడు. ఉదాహరణకు దేవుని ఈ ఆదేశాన్ని చూడండి: **"దైవప్రవక్త(స) మీకు ఇచ్చిన దాన్ని పుచ్చుకోండి. ఆయన మిమ్మల్ని వారించిన వాటి జోలికి పోకండి"** (అల్ హష్ర్: 7). మరోచోట ఇలా ఆదేశించబడింది: "నమాజును నెలకొల్పండి. జకాత్‌ను ఇవ్వండి. దైవప్రవక్తను అనుసరిస్తూ ఉండండి. తద్వారా మీరు కరుణించబడతారని ఆశించవచ్చు" (అల్ నూర్ సూరా: 56). వేరొక చోట అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించాడు: "ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు- మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు."

(ఆలి ఇమ్రాన్-31)

## జిల్‌హజ్జ ఎనిమిదవ తేదీ

హాజీ సోదరులారా! అంతిమ దైవ ప్రవక్త(స) జిల్‌హజ్జ నెల ఎనిమిదవ తేదీన 'తల్బియా' పఠిస్తూ మక్కా నుండి 'మినా' క్షేత్రానికి బయలుదేరారు. ఎక్కడున్న వారు అక్కడి నుంచే ఇహ్రామ్ దీక్ష బూని- తల్బియా పలుకుతూ- మినా వైపుకు కదలి రావాలని కూడా ఆయన తన ప్రియసహచరులను ఆదేశించారు. అందుకే హజ్ చేయదలచిన వారు - మక్కా వాసులైనా, దూరప్రాంతాల నుంచి వచ్చి, ఉమ్రా చేసి ఇహ్రామ్ దీక్ష నుంచి బయటపడిన వారైనా- జిల్‌హజ్జ్ 8వ తేదీన తాము మకాం చేసిన స్థలం నుంచే ఇహ్రామ్ దీక్ష బూని 'మినా' కు వెళ్ళాలి. ఇదే ప్రవక్త(స) విధానం.

మినాకు వెళ్ళేటప్పుడు తవాఫ్ (కాబా ప్రదక్షిణ) చేయటం సరైన పద్ధతి కాదు. అయితే మీఖాత్ నుంచి వచ్చే సమయంలో ఆచరించిన క్రియలన్నీ




ఇహ్రామ్ దీక్ష సందర్భంగా నెరవేర్చవచ్చు. ఉదాహరణకు: స్నానం చేయటం, సువాసన పూసుకోవటం మంచిది. హజ్రత్ ఆయిషా(ర.అన్హా) 'మీఖాత్' నుంచి బయలుదేరే సమయంలో కేవలం 'ఉమ్రా' సంకల్పం చేసుకుని ఇహ్రామ్ దీక్ష బూనారు. తీరా ఆమె గారు మక్కాకు చేరుకునే సరికి బహిష్టు అయ్యారు. అందుచేత ఆమెగారు ఉమ్రా చేయలేకపోయారు. అయితే జిల్ హజ్జ్ 8వ తేదీన స్నానం చేసి హజ్ కొరకు ఇహ్రామ్ దీక్ష బూనవలసిందిగా దైవప్రవక్త(స) ఆమెను ఆజ్ఞాపించారు. హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఈ ఆజ్ఞను శిరసావహిస్తూ 'హజ్జె ఖిరాన్' చేశారు. దైవప్రవక్త(స) మరియు ఆయన సహచరులు 'మినా' క్షేత్రానికి వెళ్ళి జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా, ఫజ్ర్ నమాజులు చేశారు. 4 రకాతులు గల నమాజులను 2 రకాతులుగా కుదించి (ఖస్ర్) చేశారు. ఇదే దైవప్రవక్త(స) విధానం. హజ్ యాత్రికులు వీలైనంత అధికంగా 'తల్బియా' పలుకుతూ ఉండాలి. దైవధ్యానం చేస్తూ, దివ్యఖురాన్‌ను పారాయణం చేస్తూ ఉండాలి. మంచిని గురించి ఆజ్ఞాపిస్తూ, చెడుల నుంచి వారిస్తూ, అగత్యపరులకు దానధర్మాలు చేస్తూ ఉండాలి.

## అరఫా దినం

జిల్‌హజ్జ్ 9వ తేదీ సూర్యోదయం తరువాత ప్రవక్త(స) తన సహచరుల సమేతంగా తల్బియా, తక్బీర్లు పలుకుతూ అరఫాత్ మైదానం వైపుకు సాగిపోయారు. అరఫాత్ మైదానానికి సమీపంలో 'నిమ్రా' లోయలో కాస్సేపు ఆగి, పొద్దు వాలిన తరువాత అరఫాత్ మైదానంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన(స) వాహనంపై నుంచే ప్రజలనుద్దేశించి, చరిత్రాత్మకమైన ప్రసంగం చేశారు. ముస్లిములు పరస్పరం రక్తపాతం సృష్టించటం, ఒకరి ధనాన్ని కాజేయటం, మానమర్యాదలను మంట గలపటం నిషేధించబడినట్లు ఈ శుభసందర్భంగా ఆయన (స) ప్రకటించారు. ముస్లిములు ఖుర్‌ఆన్ హదీసులకు కట్టుబడి ఉన్నంత కాలం పెడత్రోవ పట్టకుండా ఉంటారని వక్కాణించారు. ఈ ఉపదేశాన్ని ముస్లిం‌లు ఖచ్చితంగా పాటించటం అనివార్యం. ఎందుకంటే ఈ హితోపదేశంలోనే వారి శుభశ్రేయాలు, ఇహపర సాఫల్యాలు ఇమిడి ఉన్నాయి. ఆ తరువాత దైవప్రవక్త(స) ఒకే అజాన్‌తో జుహ్ర్, అస్ర్ నమాజులను చేయించారు.





ఇకామత్ మాత్రం రెండు సార్లు చెప్పబడింది. నాలుగేసి రకతులకు బదులు రెండేసి రకతుల చొప్పున (ఖస్ర్) చేసి, జుహ్ర్ సమయంలో ఈ రెండు పూటల నమాజులు చేయించారు. నమాజు ముగించాక ఖిబ్లా వైపునకు తిరిగి దైవధ్యానంలోను, దుఆలోనూ లీనమైపోయారు. సూర్యాస్తమయం వరకూ ఈ ధ్యానం కొనసాగింది. ఆ రోజు ఆయన(స) ఉపవాసం పాటించలేదు. హజ్ యాత్రీకులు ఈ విషయాన్ని ఖచ్చితంగా పాటిస్తూ, అరఫా దినాన ఉపవాస వ్రతం ఉండరాదు. పైగా వారు రెండు చేతుల్ని ఎత్తి సాయంత్రం వరకూ అల్లాహ్ సమక్షంలో ప్రార్ధిస్తూ ఉండాలి. ఇతరత్రా విషయాలలో పడి విలువైన సమయాన్ని వృధా చేయకూడదు. కారుణ్య పర్వతం (జబ్లె రహ్మా) వద్దకు పోయి గుమిగూడరాదు. ఇలా చేయటం ప్రవక్త(స) విధానానికి విరుద్ధం. మహనీయ ముహమ్మద్(స) ఈ విధంగా ప్రవచించారు: "అరఫా దినాన అల్లాహ్ అత్యధిక మందికి నరకం నుంచి విముక్తిని ప్రసాదిస్తాడు. ఇంకా ఆనాడు అల్లాహ్ దగ్గరలోకి వచ్చి తన దూతల ముందు తన దాసులను గురించి ప్రస్తావిస్తాడు. వేరొక హదీసు ప్రకారం అల్లాహ్ ఇలా అంటాడు: "నా దాసులను చూడండి! వీళ్ళు ఎంతో నిరాడంబర జీవులుగా- చెదరిన జుత్తుతో- నా సన్నిధికి వచ్చి ఉన్నారు. నా కారుణ్యం కొరకు తహతహలాడుతున్నారు. నేను వీళ్ళందరినీ క్షమించానన్న విషయానికి మీరు సాక్షులుగా ఉండండి!" **"నేనిక్కడ ఆగి ఉన్నాను. అయితే అరఫాత్ మైదానమంతా ఆగి ఉండవలసిన స్థలమే"** అని మహాప్రవక్త(స) వక్కాణించారు.


## ముజ్దలిఫాకు పయనం

సూర్యాస్తమయం కాగానే మహాప్రవక్త(సఅస) తల్బియా పలుకుతూ ముజ్దలిఫా వైపుకు సాగిపోయారు. అక్కడకు చేరుకోగానే ఒకే అజాన్, రెండు ఇఖామత్‌లతో ఆయన(స) మగ్‌రిబ్, ఇషా నమాజులు చేయించారు. మగ్రిబ్ నమాజ్‌లో మూడు రకాతులు పూర్తిగా చేశారు. ఇషా నమాజులో మాత్రం ఖస్ర్ చేశారు (2 రకాతుల నమాజ్ చేశారు). నమాజ్ అనంతరం అక్కడే నిద్రించారు. ఫజ్ర్ నమాజును సున్నత్ సమేతంగా చేశారు. అనంతరం "మస్ అరే హరామ్" అనే కొండ దగ్గరకు వచ్చి దైవధ్యానంలో, దైవస్తోత్రంలో గాఢంగా లీనమైపోయారు. చేతులెత్తి ప్రార్ధించారు. తరువాత ఇలా అన్నారు: **"నేనిక్కడ విడిది చేశాను. అయితే ముజ్దలిఫా అంతా విడిది చేయవలసిన స్థలమే. హజ్ యాత్రీకులు తాము ఆగినచోటే రాత్రి గడపాలి. ఫజ్ర్ నమాజ్ అనంతరం వీలయినంత ఎక్కువగా దుఆ చేయాలి."** కాబట్టి హజ్ యాత్రీకులు దైవప్రవక్త(స) ఆగినచోటే ఆగాలనుకోవటం అవశ్యం కాదు. మహిళలు, చిన్నపిల్లలు రాత్రి చివరి భాగంలోనే 'ముజ్దలిఫా' నుంచి 'మినా' వెళ్ళిపోయేందుకు అనుమతి ఇవ్వబడింది. అలా వెళ్ళిన వారు రాత్రి పూటే పెద్ద జమ్రాపై కంకర రాళ్ళు రువ్వవచ్చు. మహిళల సౌకర్యార్థం ఈ వెసులుబాటు కల్పించబడిందని హజ్రత్ ఉమ్మె సలమా, హజ్రత్ అస్మా బిన్తె అబూబకర్ (ర.అన్హా)ల ద్వారా తెలుస్తోంది.

## పదవ తేదీ పండుగ దినం

ముజ్దలిఫాలో ఫజ్ర్ నమాజు చేసి, తెల్లవారిన తరువాత మహాప్రవక్త(స) తల్బియా పలుకుతూ 'మినా' వైపుకు బయలుదేరారు. అక్కడకు చేరుకోగానే అన్నిటికన్నా ముందు పెద్ద జమ్రాలపై ఏడు కంకరరాళ్లు రువ్వారు. మొదటిసారి రాయి విసిరేటప్పుడు 'బిస్మిల్లాహి అల్లాహు అక్బర్' అని, మిగిలిన ఆరుసార్లు కేవలం అల్లాహు అక్బర్ అని పలికారు. ఆ తరువాత ఖుర్బానీ ఇచ్చి, శిరో ముండనం చేయించుకున్నారు. అప్పుడు హజ్రత్ ఆయిషా(ర.అన్హా) ఆయన (స) కు సువాసన పూసారు. అనంతరం ఆయన మక్కాకు వెళ్ళి తవాఫె జియారత్ (తవాఫె ఇఫాజా) చేశారు. హజ్ క్రియలు వెనుకా ముందు, ముందు వెనుకా కావటం గురించి ఆ రోజు కొంతమంది ప్రశ్నించగా "ఫరవాలేదు, కానివ్వండి" అని ఆయన(స) బదులిచ్చారు. "దైవప్రవక్తా! నేను తవాఫ్‌కు ముందే సయీ చేశాను" అని ఒక వ్యక్తి సందేహపడగా "వచ్చిన నష్టం ఏమీలేదు" అని ఆయన(స) వ్యాఖ్యానించారు.

కాబట్టి హజ్ యాత్రీకులు 10 వ తేదీన దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరిస్తూ మొదట పెద్ద జమ్రాపై ఏడుసార్లు కంకర రాళ్లు రువ్వాలి. ఖుర్బానీ ఇవ్వవలసినవారు అక్కడే ఖుర్బానీ ఇచ్చి శిరోముండనం చేయించుకోవటం మంచిది. ఎందుకంటే ఇలా చేసిన వారిని మన్నించమనీ, కరుణించమనీ దైవప్రవక్త(స) మూడుసార్లు ప్రార్థించారు. శిరోముండనం చేయించుకోకుండా జుత్తును కత్తిరించినా ఫరవాలేదు. దీంతో హాజీపై ఉన్న ఇహ్రామ్ ఆంక్షలు తొలగిపోతాయి. అయితే తవాఫ్ (కాబా ప్రదక్షిణ) పూర్తి కానంతరవరకూ అతడు స్త్రీతో సంభోగించలేడు. ఇది తప్ప మిగిలినవన్నీ అతని కొరకు ధర్మసమ్మతం అవుతాయి. ఆ తరువాత హాజీలు మక్కాకు వెళ్ళి తవాఫ్ చేయాలి. 'హజ్జె తమత్తు' సంకల్పం చేసుకున్నవారు 'తవాఫ్'తోపాటు 'సయీ' కూడా చేయాలి. హజ్జె ఖిరాన్, హజ్జె ఇఫ్రాద్ చేసేవారు ముందుగానే సఫా-మర్వాల మధ్య సయీ చేసి ఉంటే ఈ 'సయీ' సరిపోతుంది. ఒకవేళ వారు ముందుగా సయీ చేయకుండా ఉంటే ఇప్పుడు చేసుకోవాలి.



## జిల్‌హజ్జ్ 11,12,13 తేదీలు

తవాఫ్, సయీ చేసిన తరువాత దైవప్రవక్త(స) 'మినా' ప్రదేశానికి తిరిగివచ్చారు. 11,12,13 తేదీలలో అక్కడే ఆగారు. మధ్యాహ్నం పొద్దువాలిన పిదప మూడు జమరాత్ (స్థంబాల) పై ఒకేసారి కంకరరాళ్లు రువ్వేవారు. కంకర రాళ్లు రువ్వే ప్రతిసారీ 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. మొదటి రెండు స్థంభాలపై రాళ్లు రువ్విన తరువాత కాబా దిశవైపుకు తిరిగి దుఆ చేశారుగాని మూడవ స్థంభంపై రాళ్లు రువ్విన తరువాత దుఆ చేయలేదు.

13వ తేదీన రాళ్లు రువ్వటం పూర్తవగానే ఆయన(స) మినా నుండి మక్కాకు పయనమయ్యారు. దారిలో 'అవతహ్' అనే లోయలో ఆగి జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా నమాజులు చేశారు. రాత్రి చివరిభాగంలో మక్కాలోకి ప్రవేశించి ఆఖరుసారిగా కాబాగృహ ప్రదక్షిణ చేశారు. అక్కడే ఫజ్ర్ నమాజు చేసి 14వ తేదీ ఉదయం మదీనాకు ప్రయాణమయ్యారు.

కాబట్టి హజ్ యాత్రీకులంతా దైవప్రవక్త(స) విధానాన్ని అనుసరిస్తూ పొద్దువాలిన తరువాత మూడు జమరాత్‌లపై ఏడేసిసార్లు కంకర రాళ్లు రువ్వాలి. రాళ్లు రువ్వేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని అంటూ ఉండాలి. మొదటి రెండు స్థంభాలపై రాళ్లు రువ్వాక దుఆ చేయాలి. ఒకవేళ పగటిపూట కంకర రాళ్లు రువ్వే అవకాశం లభించకపోతే రాత్రి ఫజ్ర్ నమాజ్‌కు ముందు వరకూ రాళ్లు రువ్వవచ్చు.

12 వ తేదీన కంకరరాళ్లు రువ్విన తరువాత తొందరలో ఉన్నవారు సూర్యాస్తమయం కాక ముందే మినా నుండి వెళ్ళవచ్చు. కాని 13వ తేదీ వరకూ అక్కడే ఆగి ఉండటం ఉత్తమం. ఎందుకంటే ఇది దైవప్రవక్త(స) వారి విధానం. అదీగాక 11,12 తేదీలలో రాత్రిపూట 'మినా' లో గడపటం హాజీలకు తప్పనిసరి కూడా. అయితే షరీయతుపరమైన తగు కారణంపై ఎవరయినా వెళ్ళదలిస్తే, ఉదాహరణకు:- హాజీల మంచీ చెబ్బరలు చూసే ఉద్దేశంతోనో, ఖుర్బానీ పశువులను పర్యవేక్షించే ఉద్దేశంతోనో ఎవరయినా అక్కడ రాత్రి పూట ఆగలేకపోతే అది ఆక్షేపణీయం కాదు. అలాగే 13వ తేదీ రాత్రి 'మినా' లో ఏ ఒక్క హాజీ ఆగనవసరంలేదు. సూర్యుడు అస్తమించక ముందే అక్కడి నుంచి వెళ్ళిపోవాలి. ఒకవేళ సూర్యాస్తమయం అయ్యేవరకు బయలుదేరకపోతే మినాలో ఉండిపోవటం అనివార్యం. 13వ తేదీ తరువాత కూడా 'మినా' లో ఉండిపోయిన వారు కంకర రాళ్లు రువ్వటం ధర్మసమ్మతం కాదు.

## అంతిమ ప్రదక్షిణ

హజ్ యాత్రీకుడు తన స్వస్థలానికి తిరిగి వెళ్ళాలనుకున్నప్పుడు ఆఖరుసారిగా కాబా గృహప్రదక్షిణ చేయటం అవసరం. ఎందుకంటే,

**"ఏ హజ్ యాత్రీకుడు కూడా కడసారి ప్రదక్షిణ చేసేవరకూ తన స్వదేశానికి తిరిగి వెళ్ళరాద"** ని మహా ప్రవక్త(స) ఉపదేశించారు. అయితే రుతుస్రావానికి, పురిట రక్త స్రావానికి గురై ఉన్న మహిళలకు ఇది వర్తించదు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారి ఉల్లేఖనం దీనికి ఆధారం.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ తనకు నచ్చిన, తాను మెచ్చిన పనులు చేసే సద్బుద్ధిని అందరికీ ప్రసాదించాలనీ, మనందరి ప్రార్థనలను స్వీకరించాలని, మనందరినీ నరకాగ్ని నుంచి కాపాడాలని ప్రార్థిస్తున్నాను. అల్లాహ్‌యే అందరికీ స్వామీ, యజమాని . ఆయనే శక్తిశాలి, సర్వాధికారి. మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పై, ఆయన పరివారంపై ఆయన సహచరులపై శాంతి శుభాలు వర్షించుగాక! (ఆమీన్)